

జిల్లాలో 44.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25: జిల్లాలో గురువారం 44.1డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణి మండలంలో 44.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా రెబ్బెనలో 42.7డిగ్రీలు, దహెగాంలో 41.7డిగ్రీలు, కాగజ్‌నగర్‌లో 41.4డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 41డిగ్రీలు, పెంచికలపేటలో 40.9 డిగ్రీలు, కౌటాలో 40.8డిగ్రీలు, బెజ్జూరులో 40.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మలేరియా నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి

● డీఎంహెచ్‌వో తుకారాంభట్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 25: జిల్లావ్యాప్తంగా మలేరియా నిర్మూలనకు స్వమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్ స్పష్టం చేశారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మలేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటుచేసిన జాతీయకీటక జనిత వ్యాధి నివారణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ వెంకటేష్ దోత్రే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌వో సూచనల మేరకు 2030వరకు మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఇంటిపరిసరాల్లో మురుగునీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ప్రతిరోజు డ్రైడేగా పాటించాలని సూచించారు. ఇళ్లలో దోమ తెరను వినియోగించాలని, మలేరియా సోకినట్లు అనుమానం కలిగితే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ప్రోగాంఅధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

బెజ్జూరు, ఏప్రిల్ 25: పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఈనెల27న వస్తున్న నేపథ్యంలో బెజ్జూరులో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరిశీలించారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టా లని సూచించారు. ఆయనవెంట నాయకులు బషరత్‌ఖాన్, వెంకన్న, నరేందర్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వారసంతల్లో వసతులు కరువు

- కనీస సౌకర్యాల కల్పించని అధికారులు, నాయకులు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు
- ఎండలోనే కూరగాయల విక్రయాలు
- సౌకర్యాలు కల్పించాలని ప్రజల డిమాండ్



రవీంద్రనగర్ వారసంతలో కవర్ల నీడలో కూరగాయల విక్రయాలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 25: గ్రామాల్లో ఎక్కువగా ప్రజలు వారసంతల్లోనే తమకు కావాల్సిన నిత్యావసర సరకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. నిత్యం జిల్లాలోని ఏదో ఒక్క మండలంలో వారసంత జరుగుతూ ఉంటుంది. ఈ వార సంతలకు ప్రతీ ఏడాది ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలి. కానీ చాలా వారసంతల్లో ఇలాంటి సౌకర్యాలు ఎక్కడా కన్పించడం లేదు. వ్యాపారులు సైతం ఎండలోనే రోడ్లపైనే విక్రయాలు జరుపుతుండడంతో వినియోగదారులు, ప్రజలు అనేక అవస్థలు పడాల్సి వస్తున్నది.

ఏడాదికి సుమారు ఆదాయం..

జిల్లాలోని పలు మండలాల్లో వారసంతలు జరుగుతాయి. వీటికి ప్రతీఏడాది వేలం ద్వారా ఆదాయం సమకూ రుతుంది. ఈ ఆదాయంతో సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. చింతల మానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతకు రూ.3 లక్షల ఆదాయం వస్తుంది. గూడెం, చింతలమానేపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించే వార సంతలకు రూ.లక్ష చొప్పున ఆదాయం వస్తుంది. అలాగే జిల్లాలోని కౌటాల వారసంతకు రూ.5లక్షలు, వాంకిడి వారసంతకు రూ.9లక్షలు, బెజ్జూరు వార సంతకు రూ.3.5లక్షలు, రెబ్బెన రూ.3.4 లక్షలు, జైనూరు వారసంతకు రూ.15లక్షలు, కెరమెరి వారసంతకు రూ.3లక్షలు, సిర్పూర్(టి) వార సంతకు రూ.4లక్షలు ఇలా ఆదాయం ప్రతీ ఏడాది సమకూరుతుంది. ఈ ఆదాయంతో వార సంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

ఎండలోనే విక్రయాలు..

ఎండలోనే వ్యాపారులు వివిధ రకాల వస్తువులను విక్రయాలు జరుపుతున్నారు. ఎండవేడిమికి తట్టుకోలేక పోతున్నామని, షామియానాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్లపైనే విక్రయాలు జరుగుతుండడంతో వినియోగ దారులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ కూడా ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారు. ఆటో వాలాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపైనే ఆటోలు సైతం నిలిపి వేయడంతో ట్రాఫిక్ మరింత కష్టమవుతోంది.

అభివృద్ధికి చర్యలు ఇలా..

వారసంతకు వచ్చే ఆదాయంతోపాటు, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉన్నదని పలువురు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీలు తమ వాటా చెల్లిస్తే అందులో కనీసం 10వంతుల డబ్బుల ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సమకూరుస్తుంది.

ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా అధికారుల సమన్వయంతో వారసంతల అభివృద్ధికి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి..

తుమ్మిడె కోటేష్, కర్జెల్లి

వారసంతల్లో కనీస సౌకర్యాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలి. మరుగుదొడ్లు ఉండేలా చూడాలి. వ్యాపారులు సైతం ఎండలోనే విక్రయాలు జరుపుతున్నారు. వారసంతలు రోడ్లపైనే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కనీససౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

జిల్లాలో పర్యటించిన ఎన్నికల పరిశీలకుడు



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న రాజేంద్ర విజయ్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్ గురువారం జిల్లాలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలపైన ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే 8523876384ను సంప్రదించవచ్చన్నారు. ఆదిలాబాద్‌లోని పెన్‌గంగా అతిథి గృహంలో మధ్యాహ్నం 3నుంచి 4గంటల వరకు నేరుగా కలవవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా ఓటరు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఫ్లెక్సీ వద్ద జిల్లాఎన్నికల అధికారులతో కలిసి ఫొటో దిగారు. జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పరిశీలకులకు జిల్లాఎన్నికల అధికారులు వివరించారు. అంతకుముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్‌కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, తహసీల్దార్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికశాతం అయ్యేట్లు చూడాలి..

కాగజ్‌నగర్: వచ్చేనెల 13న జరిగే పార్లమెంట్ల ఎన్నికల్లో అధికశాతం పోలింగ్ అయ్యేట్లు చూడాలని ఆదిలాబాద్ పార్లమెంటు ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ తెలిపారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఎన్నికల నిర్వహణ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్‌కు అర్హత గల ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, సహాయఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, కంట్రోల్‌రూం, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంబంధిత విభాగాల అధికారులతోపాటు అదనపు సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు.ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేట్లు చూడాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ప్రశాంత వాతావరణంలో ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేట్లు చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 85సంవత్సరాల వయసుపై బడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు హోం ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో పగడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌కు విచ్చేసిన రాజేంద్ర విజయ్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్



కాగజ్‌నగర్‌లో పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకుంటున్న రాజేంద్ర విజయ్

పోలీసు అబ్జర్వర్‌ను కలిసిన ఎస్పీ



రాజేష్‌కుమార్ సక్సెనాకు పూల మొక్కను అందజేస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు అబ్జర్వర్ రాజేష్‌కుమార్ సక్సెనాను గురువారం ఎస్పీ సురేష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు, భద్రత ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అబ్జర్వర్‌కు తెలియజేశారు. ఈ సందర్భగా తీసుకుంటున్న భద్రత చర్యల గురించివివరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అన్నిపట్టణ, గ్రామాల్లో ప్రతిరోజు వాహనాల తనిఖీతోపాటు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలియజేశారు. అలాగే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాలతో నిరంతరం కూంబింగ్ ఆపరేషన్, గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

బీఆర్ఎస్ గెలుపునకు సమన్వయంతో పని చేయాలి

●ఎమ్మెల్సీ దండే విఠల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 25: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పాత తేడా లేకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. నియోజకవర్గ పరిధిలో కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేసి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య, సరస్వతీ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి



దహెగాంలో ప్రచారం నిర్వహిస్తున్న రావి శ్రీనివాస్

దహెగాం/పెంచికలపేట, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని కాంగ్రెస్ తాలుకాఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన దహెగాం మండలంలోని రాంపూర్, దిగడ, కర్జీ, పెంచికలపేట మండలంలోని ఆగర్‌గూడ, కమ్మర్‌గాం, మురళీగూడ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్నివర్గాల ప్రజల సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవు తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఎంపీపీ సులోచన, సంతోష్, నాయకులు కృష్ణ, సంజీవ్, సుధాకర్, సజితి, ఇర్ఫాన్, పెంచికలపేటలో నాయకులు బండు, సాజీద్, సంజీవ్, సుధాకర్, మదునయ్య, రాజన్న, బాపూజీ, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం



అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేయొద్దు



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25: శ్రీరాంపూర్ ఏరియాలోని యాజమాన్యం ఇటీవల కొందరు కార్మికుల నుంచి అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేసిందని, మరికొంత మందికి నోటీసులు జారీ చేసిందని ఈచర్యలను వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు ఏరియా జీఎం బి సంజీవ రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ఉప ప్రధానకార్యదర్శులు కె వీర భద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా మాట్లాడుతూ, ఎస్ఆర్పీ3 గనిలో పనిచేస్తున్న 147మంది కార్మికుల మార్చి నెల వేతనాల నుంచి అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేసిందన్నారు. ఏప్రిల్ వేతనాల నుంచి రికవరీ చేసేందుకు 81మంది ఆర్కే5 కార్మికులకు, 115మంది ఆర్కే న్యూటెక్ కార్మికులకు నోటీసులు జారీ చేసిందన్నారు. యాజమాన్యం అవసరం నిమిత్తం అండర్‌గ్రౌండ్‌లో పని కేటాయిస్తే కార్మికుల నుంచి అండర్‌గ్రౌండ్ అలవెన్సును రికవరీ చేయవద్దని ఒప్పందం ఉందన్నారు. కానీ యాజమాన్యం సంబంధిత సర్క్యులర్‌ను ఉల్లంఘించడం సరికాదన్నారు. అలవెన్సులను తిరిగి ఇచ్చివేయాలన్నారు. వేరేవారికి కోత విధించవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎం కార్యాలయం పిట్ కార్యదర్శి రామచందర్, అఫ్రోజ్‌ఖాన్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణప్రసాద్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25: హెచ్ఎంఎస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడిపెల్లి కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం గోదావరిఖనిలో జరిగిన యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకున్నారు. కృష్ణప్రసాద్ గతంలో సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయనకు కార్మిక సమస్యలపై అవగాహన ఉంది

టీబీజీకేఎస్‌లో చేరిన మహిపాల్ రెడ్డి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25: శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ కార్మిక నాయకుడు గడ్డం మహిపాల్ రెడ్డి గురువారం టీబీజీకేఎస్‌లో చేరారు. రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆయనకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. సురేందర్ రెడ్డి, పెట్టం లక్ష్మణ్, బండి రమేష్, పానగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన కోసం కృషిచేయాలి



బెజ్జూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బెజ్జూరు, ఏప్రిల్ 25: మలేరియా నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పీహెచ్ఎస్ కమల అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలకేంద్రం లోని ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటువల్ల మలే రియా సంక్రమిస్తుందని నిర్మూలించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. గ్రామాల్లో దోమలవ్యాప్తి చెంద కుండా మురుగునీరు నిలువలేకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

● భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు వెంకట్రాములు



మాట్లాడుతున్న వెంకట్రాములు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 25: రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు పిలుపునిచ్చారు. గురువారం కాగజ్‌నగర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని కాపాడాలంటే ప్రత్యేకంగా బీజేపీని ఓడించాలన్నారు. బీజేపీ కేవలం మత రాజకీయం చేస్తోందన్నారు. మత భావజాలాన్ని ప్రజల నుంచి దూరం చేయటం కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బీజేపీ సర్కార్ ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేసి బెదిరింపులకు పాల్పడుతోందన్నారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, ముంజం శ్రీనివాస్, గొడిసెల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సమ్మర్ క్యాంపులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 25: ఈనెల 27నుంచి 29వరకు జిల్లాకేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌నందు ఉచిత వేసవి సమ్మర్ క్యాంపును ఉదయం9నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు ఒకప్రకటనలో తెలిపారు. ఇందులో విద్యార్థులకు రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్ నేర్పిస్తామన్నారు. ఆసక్తి గల 6,7,8తరగతలు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

ప్రతిభా గురుకులానికి విద్యార్థి ఎంపిక

వాంకిడి, ఏప్రిల్ 25: ప్రతిభాగురుకులంలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న పదోతరగతి విద్యార్థిని అగ్గు కావేరి ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి రైసాకాటూన్ తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను నిర్వహించిన టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ సెట్-2024 ప్రవేశపరీక్ష రాయగా అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భగా పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

●జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 25: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల యాజమానులు తప్పకుండా స్టాక్ వివరాలను బోర్డుపై పెట్టాలన్నారు. అనంతరం యాజమానులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువులు దుకాణాలు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు




















సమష్టి కృషితో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం

కాసిపేట, ఏప్రిల్ 25: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించుకుందామని పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నామని, ఇదే స్ఫూర్తితో కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సైనికుల్లా పనిచేయాలన్నారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి కాసిపేట నుంచి ముత్యంపల్లి మీదుగా రోడ్‌షో ఉంటుందని, సాయంత్రం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గేట్ ఎదుట సభ, సాయంత్రం కొండాపూర్ యాప వద్ద కార్నర్ మీటింగ్‌లను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పుస్కూరి వంశీకృష్ణరావు, రౌతు సత్తయ్య, మేరుగు శంకర్, రాజిరెడ్డి, కుమారస్వామి, నర్సయ్య, రాజు, సాపాట్ శంకర్, ఏనుగు జనార్ధన్‌రెడ్డి, రాజమౌళి, రమేష్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

తాండూర్, ఏప్రిల్ 25: ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన దుర్గం సంజన అనే విద్యార్థినీని గురువారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ తాండూర్ గ్రామంలోని నిరుపేద దంపతులైన దుర్గం లక్ష్మీమోహన్ కూతురు సంజన 440 మార్కులకు 432 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీటీసీ శంకర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి. శంకర్, రఘు, రవి, భీమేష్, అఖిల్‌పాషా, రాజేశం తదితరులు పాల్గొన్నారు.


కార్యవర్గం

ఏసీసీ, ఏప్రిల్ 25: మంచిర్యాల మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గోగర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బూడిద శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా ఉప్పులేటి రామస్వామి, ఆవుల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఎన్నికైన సభ్యులు తెలిపారు.

యువతి వివాహానికి చేయూత

దండేపల్లి,ఏప్రిల్ 25: తాళ్లపేటకు షేక్ యూసిఫ్ కూతురు షేక్ ఆర్షియభాను వివాహానికి తాళ్లపేట ఎంపీటీసీ కంది హేమలత, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్ దంపతులు చేయూతనిచ్చారు. గురువారం రూ. 8వేల నగదును అందజేశారు. మాజీ సర్పంచు ఆడాయి కాంతరావు, నాయకులు సాధిక్, సల్మా, సోహైల్, సముదానీ,నజీర్, లచ్చన్న, సర్పయ్య,గోవిండ్, జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.







నగదు పట్టివేత

ఏసీసీ, ఏప్రిల్ 25: మంచిర్యాల పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో గురువారం సాయంత్రం నిర్వహించిన పోలీసు తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ ప్రశాంత్ తెలిపారు. తాండూర్ ఐబీకి చెందిన కటకం నరేష్ రూ. 61 వేల నగదు ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా పట్టుకున్నామన్నారు. నగదుకు ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో సీజ్ చేశామన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఎల్‌ఐసీ కాలనీకి చెందిన ఒడ్ల ఆదిత్య రూ. 51 వేలను ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా తనిఖీ చేయగా నగదు లభించడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు

ఏసీసీ, ఏప్రిల్ 25: సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్ ఇతర సోషల్ మీడియా వేదికల్లో రాజకీయ నేతలను లక్ష్యంగా చేస్తూ, మతానికి సంబంధించిన ప్రముఖుల్ని లక్ష్యంగా చేసుకుని కొందరు పోస్టులు పెడుతున్నారని, ఒక వర్గాన్ని కించపరుస్తూ పోస్టులు పెట్టేవారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో పోస్టులపై నిఘా ఏర్పాటు చేస్తున్నామని, లాఅండ్ ఆర్డర్ సమస్యలు సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా ప్రతి ఒక్క సోషల్ మీడియాపై నిఘా ఉంటుందని తెలిపారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్‌రావు, ఇన్‌స్పెక్టర్ లింగయ్య, ఎస్‌ఐ రాజమణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్, నృత్యాలు చేస్తున్న శ్రీహర్ష డిగ్రీ కళాశాల విద్యార్థినులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 25: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదల, ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, వారు ఎలాంటి చెడు అలవాట్లకు గురి కాకుండా పర్యవేక్షిస్తూ సన్మార్గంలో ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం చిన్నారులకు మెడల్స్ అందించారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల ఏజీఎం చైతన్యరావు, ప్రిన్సిపాల్ కవిత, జోనల్ కోఆర్డినేటర్ శ్రావణి, పాఠశాల ప్రతినిధులు వెంకటస్వామి, సంతోష్‌కుమార్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

హాజీపూర్: మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ పార్టీని వేంపల్లిలో గల మంచిర్యాల గార్డెన్‌లో నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ పల్లె భూమేష్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. క్రికెట్, క్విజ్, చెస్ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనితఠాకూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నస్పూర్: తాళ్ళపల్లిలోని మదర్స్ ప్రైడ్ ప్లే స్కూల్‌లో నర్సరీ, ఎల్‌కేజీ, యుకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. విద్యార్థులు క్యాప్ గౌన్‌లో సందడి చేశారు. పై తరగతులకు ప్రమోషన్ పత్రాలను తహసీల్దార్ శ్రీనివాస్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ఉపేందర్, డైరెక్టర్ విష్ణు, రాజేందర్, ఇన్‌చార్జీ స్వదీప్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేవైఎం పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఆంజనేయులు

ఏసీసీ, ఏప్రిల్ 25: పెద్దపల్లి పార్లమెంట్ బీజేవైఎం ఇన్‌చార్జిగా జిల్లా కేంద్రానికి చెందిన తుల ఆంజనేయులు నియమితులయ్యారు. ఆంజనేయులు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుంభకోణాలకు అడ్డాగా కాళేశ్వరం ప్రాజెక్టు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25: బీఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంభకోణాలకు అడ్డాగా మారిందని, రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం రాత్రి యాపల్ ఏరియాలో శివకేశవ ఆలయం వార్డు ఇన్‌చార్జి రాచర్ల రవి, మెండె భాస్కర్‌ల ఆధ్వర్యంలో మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుంభకోణాలకు పాల్పడి కుటుంబ సంపదను పెంచుకున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన మూడు నెలలకే కుప్పకూలిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. కాకా వెంకటస్వామి కార్మికులకు, ప్రజలకు చేసిన సేవలు మర్చిపోలేనివని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీ వివేక్‌ను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పట్టణ ఉపాధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, నాయకులు సుదర్శన్, గుడ్ల రమేష్,నూకల రమేష్, బండి సదానందం, దుర్గం నరేష్, రాజేష్, విజయ్, జావేద్‌ఖాన్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 25 : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. గురువారం కేతనపల్లిలో పారిశుధ్య పనులను, నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని సూచించారు. నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, పైపులైన్ల లీకేజీ, చేతి పంపులు చెడిపోతే మరమ్మతు చేయించాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శి జాఫర్ అలీ, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్)

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25: ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫెయిలయ్యాననే మన స్తాపంతో విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుభాష్‌నగర్‌కు చెందిన నూన్సావత్ అరవింద్(17) మంచిర్యాలలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం వెలువడిన ఫలితాల్లో గణితం ఒక పేపర్‌లో ఫెయిల్ అయ్యాడు. మనస్తాపం చెందిన అరవింద్ రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తరువాత ఉరి వేసుకున్నాడు. వేకువజామున కుటుంబ సభ్యులు గమనించి అతన్ని మంచిర్యాల ప్రభు త్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీక రించారు. అరవింద్ తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్ (ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 25: మండలంలోని టేకుమట్ల శివారులోని చాకిరేవు మూలమలుపు వద్ద చెట్టుకు ఢీకొని సొల్లారి అజయ్ (22) అనే యువకుడు మృతి చెందాడు. మద్దులపల్లి గ్రామానికి చెందిన అజయ్ బైక్‌పై పని నిమిత్తం ఇందారం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా టేకుమట్ల చాకి రేవు మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అజయ్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తాడని, తండ్రి పోశం ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.

హెల్మెట్ ధరించి ఉంటే బతికుండేవాడు

బైక్‌పై ప్రయాణిస్తున్న ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పకుండా వాడాలని, అనుకొని ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. అజయ్ హెల్మెట్ పెట్టుకుని ఉంటే గాయాలతో బయటపడేవాడని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

వ్యక్తిపై కేసు నమోదు

హాజీపూర్, ఏప్రిల్ 25 : గుడిపేట గ్రామానికి చెందిన ఎంబడి వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపతి సురేష్ గురువారం తెలిపారు. వెంకటేష్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినందుకు అతనిపై కేసు నమోదు చేసి 15 రోజులు జుడిషియల్ రిమాండ్‌కు పంపించామని తెలిపారు.

ఆవుపై గొడ్డలితో దాడి చేసిన నిందితుల అరెస్టు

బెల్లంపల్లి, ఏప్రిల్ 25: రంగపేట గ్రామ శివారులో ఆవు కాళ్లు నరికిన నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. గురువారం సీఐ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 23న మాలగురిజాలలో ఆవు కాళ్లు నరికివేశారని చల్లూరి దయాకర్ ఫిర్యాదు చేశాడన్నారు. దుగ్నేపల్లికి చెందిన దుగుట వెంకటస్వామి, కుమ్మరి కళ్యాణ్‌లను విచారించగా గతంలో పశువులను దొంగతనం చేసి చంపి మాంసాన్ని విక్రయించామని ఒప్పుకున్నారన్నారు. ఈనెల 23న కుమ్మరి కళ్యాణ్, బట్వాన్‌పల్లికి చెందిన ఆకుదారి చంద్రశేఖర్‌ను ఎక్కించుకుని రంగపేట శివారు ఉప్పర్ల చెరువు దగ్గరలో ఉన్న ఆవు కాళ్లు నరికి చెట్ల పొదల్లో హతమార్చినట్లు నేరం ఒప్పుకున్నారన్నారు. చంద్రశేఖర్ పరారీలో ఉన్నాడని, వెంకటస్వామి, కళ్యాణ్‌లను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ నరేష్ పేర్కొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కన్నెపల్లి, ఏప్రిల్ 25: వెంకటాపూర్ శివారులో గురువారం నాలుగు కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ గంగారం తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో భీమిని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్‌తో కలిసి వెళ్లి తనిఖీలు చేయగా పున్నపురెడ్డి చంద్రయ్య నకిలీ విత్తనాలు దొరికాయన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాండూర్, ఏప్రిల్ 25: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి దాగం రాజారాం అన్నారు. ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ఇచ్చినట్లుగా అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు ప్రకటించాలని కోరారు.

4న కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 25: కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలు, మే 4న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంచిర్యాల రోడ్‌షో విజయవంతం చేయుటకు దిశా నిర్దేశం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించేలా నాయకులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం

ఏసీసీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పెద్దపల్లి లోక్‌సభ బరిలో నామినేషన్లు వేసింది వీరే...

1. కొప్పుల ఈశ్వర్ (భారత రాష్ట్ర సమితి)
2. గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)
3. గొమాసె శ్రీనివాస్ (భారతీయ జనతా పార్టీ)
4. అక్కపాక తిరుపతి, 5. దూడ మహిపాల్, 6. దుర్గం రాజ్‌కుమార్ (స్వతంత్ర)
7. కొంకటి లింగమూర్తి (బీఆర్‌ఎస్ రెబల్)
8. గవ్వల శ్రీకాంత్ 9. లచ్చయ్య (స్వతంత్ర) మేకల అక్షయ్ కుమార్ (స్వతంత్ర) 11. జాడి ప్రేమ్ సాగర్ (స్వతంత్ర) 12. మోతె నరేష్ (స్వతంత్ర)
13.కట్కూరి సందీప్ (కాంగ్రెస్ రెబల్), (స్వతంత్ర)
14. దుర్గం సమ్మయ్య 15. ఆర్నకొండ రాజు 16. గడ్డం మారుతి 17. రాముల కార్తీక్ 18. జుమ్మిడి గోపాల్ 19. అంబాల మహేందర్ 20. జనగామ నరేష్ 21. ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ 22. దాగం సుధారాణి
23. మంద రమేష్ (ధర్మ సమాజ్ పార్టీ)
24. గద్దల వినయ్‌కుమార్ 25. బొట్ల చంద్రయ్యలు 26. తాళ్లపల్లి నరేష్ 27. రాచర్ల రాజేశం 28. ఇరికిల్ల రాజేష్ 29. సొల్లు రంజిత్ (స్వతంత్ర)
30. చిలుక ఆనంద్ (యువతరం పార్టీ)
31. సుమలత (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్)
32. ఇరుకుల్ల రాజనర్సయ్య (బీఎస్పీ)
33. కనకయ్య (సోషలిస్టు పార్టీ ఇండియా)
34. భాగ్యలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)
35. నూకల నవీన్ 36. నీరటి శంకర్ 37. కుర్మ మహేందర్ 38. మోటం రవీందర్ 39. తిరుపతి 40. కాశి సతీష్ కుమార్ 41. శ్రీనివాస్ 42. పెగడపల్లి రాజనర్సు 43. మామిడిపల్లి బాపయ్య 44. జాడి బాల్‌రెడ్డి 45. దుర్గే ఈశ్వర్ 46. శ్రీనివాస్ (స్వతంత్ర)
47. కంది చందు (రాష్ట్రీయ మానవ పార్టీ)
48. ఎస్ కుమార్ (బీజేపీ) డమ్మీ అభ్యర్థి
49. ఎం వేణుగోపాల్ (బహుజన ముక్త్ పార్టీ)
50. కె శేఖర్ 51. దుర్గం రాములు (స్వతంత్ర)
52. తిరుమల (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ)
53. చొప్పదండి భవాని (కాంగ్రెస్) 54. దేవి లక్ష్మీనర్సయ్య (స్వతంత్ర) 55. దుర్గం సంతోష్ (ప్రజారాజ్య సమితి పార్టీ) 56. రామ్ చందర్ (దళిత బహుజన పార్టీ) 57. జూపాక కిరణ్ 58. పంతకాల శ్రీనివాస్ 59. పగిడి జనార్దన్ 60. వాసర్ల నతనియల్ 61. పులికపాక రాజ్‌కుమార్ 62. కొమ్ము జగదీష్ (స్వతంత్ర) 62. ములుగు వెంకటేష్ (న్యూ ఇండియా పార్టీ)

మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

దహెగాం, ఏప్రిల్ 25: మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని వైద్యాధికారిణి స్పందన అన్నారు. గురువారం మండలకేంద్రంతోపాటు బీబ్రా, ఇట్యాల గ్రామాల్లో ప్రపంచమలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల మలేరియా జ్వరం వస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. దోమల నివారణ ప్రత్యేకచర్యలు చేపట్టాల న్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు లక్ష్మి, పద్మ, విజిత, ఆశ కార్యకర్తలు,సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అపోహలు వద్దు

బెజ్జూరు, ఏప్రిల్ 25: కుష్టువ్యాధిపై ఎవరు కూడా అపోహలు పెట్టుకోవద్దని హైదరాబాద్ లెప్రసీ డాక్టర్ వెంకటేశ్వరచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుష్టువ్యాధిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతనెలలో జరిగిన కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేలో 44మంది అనుమానితులను పరీక్షించగా అయిదుగురికి వ్యాధి నివారణ జరిగినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నయమయ్యేవరకు ఉచితంగా మందులు పంపిణీచేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో శ్యామలాల్, రాజు, కమల, దిలీప్ తదితరులు పాల్గన్నారు.

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడిగా జాబిరె రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 25: బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్య క్షుడిగా జాబిరె రవీందర్‌ను ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్షుడిగా నియమించి నందుకు పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

పెంచికలపేట, ఏప్రిల్ 25: మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన మండలపరిషత్ సర్వసభ్యసమావేశం కోరంలేక వాయిదాపడింది. సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో అల్బర్ట్ ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో గంగాసింగ్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వాంకిడి, ఏప్రిల్ 25: మండలంలోని జైత్‌పూర్, బోర్డ గ్రామ శివారులో గురువారం పేకాట స్థావరాలపై దాడులు చేసి పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వాంకిడి మండలం జైత్‌పూర్, బోర్డ గ్రామశివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించి పదిమందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3530నగదు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేశామని, ఎవరైనా పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రైలు నుంచి పడి ఒకరు మృతి

సిర్పూర్(టి), ఏప్రిల్ 25: సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ మధ్యలో బీహార్ రాష్ట్రం బరుహర్వ గ్రామానికి చెందిన అజయ్‌కుమార్(24) రైలు నుంచి పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుడు ఈనెల 14న బెంగుళూరులో రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలుఎక్కి ప్రయాణం చేస్తుండగా మార్గమధ్యలో కింద పడిమృతి చెందాడన్నారు. ఎవరు గమనించక పోవడంతో మృతదేహం కుళ్లిపోయిందన్నారు. మృతదేహం వద్ద మొబైల్‌ఫోన్ లభించగా అతని బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

పిచ్చి కుక్కల స్వైరవిహారం

బెజ్జూరు, ఏప్రిల్ 25: మండలంలోని పాపనపేట గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి మహిళను గాయపరిచింది. గురువారం గ్రామానికి చెందిన చాపిలే ఈశ్వరి అనే మహిళను గాయపర్చగా అదే గ్రామానికి చెందిన తొడిశం శంకర్‌కు చెందిన రెండుమేకలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో గ్రామస్థులు బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పిచ్చికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం

● ఆదిలాబాద్ పార్లమెంట్ బరిలో 23మంది అభ్యర్థులు ● ప్రచారానికి మిగిలింది పక్షం రోజులే ● మరింత హీటెక్కనున్న లోక్‌సభ రాజకీయం

ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల తొలిఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. ఏప్రిల్18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ వారం రోజుల పాటు కొనసాగింది. చివరి రోజైన గురువారం పెద్ద మొత్తంలో 18నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు 23మంది అభ్యర్థులు 42నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. ఈసారి అన్ని పార్టీలు అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో అనుకున్న సమయానికే నామినేషన్లను దాఖలు చేశారు. నామపత్రాలను దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇక లోక్‌సభ సమరానికి సై అంటూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎన్నికల ప్రచారానికి మరో పక్షం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో ఎన్నికల హడావిడి మొదలయ్యింది. కావాల్సిన ప్రచార సామాగ్రితో పాటు నియోజక వర్గాల వారీగా నేతలకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగిస్తూ చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా ప్రచార కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీనియోజకవర్గాల వారీగా ప్రచారం చేపట్టేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. దాదాపుగా అన్నినియోజకవర్గాల్లో పర్యటించిన అభ్యర్థులు ప్రచారంతో మరింత దూకుడును పెంచుతున్నారు. అయితే బీజేపీ మోదీ ఇమేజ్, యువత ఓట్లతో గెలుపుధీమాతో కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారం, అభివృద్ధినే ప్రధానంగా నమ్ముకుంటూ గెలువాలని ప్రయత్నాలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే గెలిపిస్తుందని బీఆర్‌ఎస్ గట్టిగా నమ్ముతోంది. మిగితాపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు సైతం ఈఎన్నికల్లో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కొంతమంది స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశాలు పెద్దగా లేకపోయిన ప్రధానపార్టీల అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి నామినేషన్‌ల దాఖలు ముగిసి పోవడంతో ఇక అభ్యర్థులు ప్రచారం పైననే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు.

● బరిలో ఉండేదెవరో !?

ఆదిలాబాద్ లోక్‌సభస్థానం కోసం అభ్యర్థులు వేసిన నామినేషన్లను ఎన్నికల అధికారులు సోమవారం పరిశీలించనున్నారు. ఈనెల 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు సమయం ముగియనుంది. ఆ తర్వాతనే లోక్‌సభ బరిలో ఎంతమంది అభ్యర్థులు ఉంటారనేది తేలిపోనుంది. మూడు ప్రధానపార్టీల అభ్యర్థులు బరిలో నిలువడం ఖాయంగానే కనిపిస్తుంది. చిన్నపార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్య ర్థుల్లో ఎవరు ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటా రోనన్న ఆసక్తి రేపుతోంది. ఈనెల29 తర్వాతనే లోక్‌సభ బరిలో నిలిచేఅభ్యర్థులు ఎవరన్నది ఖాయం కానుంది. కొంత పలుకుబడి, పట్టు ఉన్న స్వతంత్ర అభ్యర్థులను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. దీంతో ఎన్నికల బరిలో ఎవరు ఉంటారో మరెవరు తప్పుకుంటారో అనేది ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

● 42 నామినేషన్లు దాఖలు..

లోక్‌సభ స్థానానికి మొత్తం 23మంది అభ్యర్థులు 42నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆత్రంసక్కు, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్రంసుగుణ, బీజేపీఅభ్యర్థిగా గోడం నగేష్, స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు నామినేషన్లు వేశారు. టీడీపీ, వామపక్షాల నుంచి ఎవరూ నామినేషన్ వేసేందుకు ఆసక్తి చూపలేదు. మొత్తానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రధానపార్టీల మధ్యనే రసవత్తరమైన పోరు కనిపిస్తోంది. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 5 నామినేషన్ సెట్లను దాఖలు చేయగా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసక్కు 4సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ 4నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. ముందు జాగ్రత్తగా ప్రధాన పార్టీలన్నీ మరో అభ్యర్థితో నామినేషన్ సెట్‌ను దాఖలు చేయించాయి. పార్టీ ప్రకటించిన అభ్యర్థి నామినేషన్ పత్రాలు సరిగా ఉంటే పార్టీల నుంచి దాఖలు చేసిన అభ్యర్థులు తమ నామపత్రాలను ఉపసంహరించుకోనున్నారు. 2019ఎన్నికల్లో 16మంది అభ్యర్థులు 26నామినేషన్ సెట్లను దాఖలు చేయగా ఈ సారి అభ్యర్థులతో పాటు నామినేషన్‌లు భారీగా పెరిగాయి.

● పక్షం రోజులు కీలకం

వచ్చేనెల13న లోక్‌సభఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికలకు 48గంటల ముందేప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. అంటే ఏప్రిల్11 సాయంత్రం వరకే ప్రచారానికి అవకాశం ఉంటుంది. దీంతో మిగిలిన ఈపక్షంరోజులే అభ్యర్థులకు ఎంతో కీలకంగా మారనుంది. ప్రచారానికి సమయం లేక పోవడంతో నియోజక వర్గాలవారీగా సమావేశాలు నిర్వహించేందుకే పార్టీలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి. పక్షం రోజుల్లో గ్రామ గ్రామాన ప్రచారం చేయడం కష్టసాధ్యం కావడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రత్యేక సమావేశాల వైపే మొగ్గు చూపుతున్నాయి. మండల స్థాయి ముఖ్య నేతలను కలుస్తు ప్రచారం నిర్వహించనున్నారు.అసలే జిల్లాలో మండిపోతున్న ఎండలకు రోజంతా ప్రచారం చేయడం కష్టంగానే కనిపిస్తుంది. ఉన్న సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకుంటేనే అభ్యర్థులకు విజయ అవకాశాలు మెరుగు పడతాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా అభ్యర్థులు ప్రచారానికి దిగుతున్నారు. అలాగే పార్టీల ముఖ్యనేతల ప్రచారాలతో మరింత ఊపుని చ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

కౌటాల విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు



తల్లిదండ్రులతో విద్యార్థిని గీతాభవాని

కౌటాల, ఏప్రిల్ 25: ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన గీతభవాని రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. బోదంపల్లి గ్రామానికి చెందిన మోర్లె శ్రీనివాస్-లక్ష్మి దంపతుల కూతురు గీతాభవానికి ఇంటర్‌లో బైపీసీ మొదటి సంవత్సరంలో 437/440 మార్కులు సాధించింది. గీతాభవానికి 1నుంచి 4వతరగతి వరకు మండలకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సిర్పూర్(టి) సోషల్ వెల్ఫేర్‌లో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో చదువుకుంది. ఈసందర్భంగా పలువురు ఆమెతోపాటు తల్లిదండ్రులను అభినందిస్తూ సన్మానించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జైనూర్, ఏప్రిల్ 25: కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్య మవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌ముఖీద్ అన్నారు. గురువారం మండలంలోని దుబ్బగూడ, గోండుగూడ, లక్మణ్ పటేల్‌గూడ తదితర గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగణ చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మాయమాటలు చెప్పే నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ దుక్రే, శ్రీనివాస్, పెందోర్ ప్రకాష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెంచికలపేట, ఏప్రిల్ 25: మండలంలోని పలు పోలింగ్‌కేంద్రాలను కాగజ్‌నగర్ రూరల్ సీఐరాంబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలుసజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఆయన వెంట ఎస్సై కొమురయ్య ఉన్నారు.

మలిదశ ఉద్యమకారుడు వేణుకుమార్ గౌడ్ వర్ధంతి

రెబ్బెన, ఏప్రిల్ 25: మలిదశ ఉద్యమకారుడు వేణుకుమార్ గౌడ్ 12వ వర్ధంతిని గురువారం రెబ్బెనలో నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మలిదశ ఉద్యమ కారుడు వేణుకుమార్ గౌడ్ ఆశయాలను అంతా కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, జడ్పీటీసీ సభ్యుడు వేముర్ల సంతోష్, కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు మోడెం సుదర్శన్ గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు పెసరి మధనయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే ఎమ్మార్పీఎస్ మద్దతు

బెజ్జూరు, ఏప్రిల్ 25: ప్రధాని మోదీ ఎస్సీలను ఏబీసీడీ వర్గీకణ చేస్తామని హామీ ఇచ్చినందున పార్లమెంట్ ఎన్నికల్లో తమ మద్దతు బీజేపీకే ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లాఅధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధసంఘాల సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలమేరకు తమ మద్దతు పూర్తిగా బీజేపీకే ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పిట్టల సత్యనారాయణ మాదిగను, కోఇన్‌చార్జిగా తిరుపతిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, అనీల్, శంకర్, పోశన్న, శ్రీను, మొండి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి మాలధారణ



బుద్ధుడి ఉపదేశం బోధిస్తున్న బౌద్ధ భిక్షువు బంతె బుద్ధగోష్

కెరమెరి, ఏప్రిల్ 2: మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు, మహిళలు గౌతమ బుద్ధుడి మాల స్వీకరించారు. నిజామాబాద్‌కు చెందిన బౌద్ధ భిక్షువు బంతె బుద్ధగోష్ వీరికి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా పది రోజులపాటు బుద్ధుడి గ్రంథపఠనం, అష్టాంగపఠనం, పంచశీల తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్యకాంత్, శుద్దోదన్, గంగాధర్, శుభం, పల్లవి, కోమల్, పాయల్, కావ్య పాల్గొన్నారు.

రేపు సంకట హర చతుర్థి

నస్పూర్, ఏప్రిల్ 25: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో గల లక్ష్మి గణపతి దేవాలయంలో ఈనెల 27న సంకట హర చతుర్థి పురస్కరించుకుని స్వామి వారికి నారికేల జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, గణపతి హోమం 6.30 గంటలకు నారికేల జలాభిషేకం జరుగుతుందని, అనంతరం పల్లకి సేవా, అన్నదాన కార్యక్రమం ఉంటుం దన్నారు.

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసే విధానాన్ని దగ్గరుండి పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

- ముందస్తుగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- తనిఖీలు ముమ్మరం చేసిన అదనపు కలెక్టర్
- రైస్‌మిల్లుల్లో కూలీల కొరతతో అన్‌లోడింగ్ ఇబ్బందులు

మంచిర్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గత ఏడాదితో పోల్చితే సుమారు 20 రోజులు ముందుగానే కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. దీంతో గతంలో లాగా రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా పోయింది. కోసిన వరి పంటను ఆరబెట్టి, కల్లాలకు తరలించిన వెంటనే నిర్వాహకులు జాప్యం లేకుండా కాంటా ఏర్పాటు చేస్తున్నారు. ఆరు గాలం శ్రమించి పంటను సాగు చేయడం ఒకెత్తయితే... దాన్ని అమ్ముకోవడం రైతులకు శాపంగా మారేది. అష్టకష్టాలు పడి ధాన్యాన్ని కల్లాలకు తరలి స్తే 20 రోజులకు మించి పడిగాపులు కాసే వారు. కల్లాల్లో ఉంచిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇంటి ల్లిపాది శ్రమించే వారు. ఈ యేడు అధికారుల ముందస్తు ప్రణాళికలతో రైతులకు ఇబ్బం దులు తొలగిపోగా, ఐదారు రోజులలోపే నగదు ఖాతాలో జమ అవుతోంది.

ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 262 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికారులు ముందస్తు ప్రణాళికలతో 20 రోజులు ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో గతంలో ఉన్న డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను తొలగించిన అధికారులు పూర్తిగా ఐకేపీ మహిళలకే నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. నియోజ కవర్గంలో ఏర్పాటు చేసిన 77 ఐకేపీ కేంద్రాల్లో మహిళలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాల్లోనూ ఐకేపీ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తూకంలో అవకతవకలకు చెక్

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడంలో అవకతవకలకు చోటు లేకుండా అదనపు కలెక్టర్ మోతీలాల్ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. గతంలో డీసీఎంఎస్ కేంద్రాల్లో 40 కేజీల గన్నీ బ్యాగుపై అదనంగా రెండు మూడు కిలోల ధాన్యాన్ని నిర్వాహకులు తూకం వేశారు. అలా అదనంగా తూకం వేసిన ధాన్యం నిర్వాహకుల ఖాతాల్లోకి వెళ్లేది. 40 కిలోలపై రైతుకు సుమారు రూ. 100 నష్టం వాటిల్లేది. ప్రస్తుతం 40 కేజీల బ్యాగుపై కేవలం ఒక కిలో మాత్రమే అదనపు తూకం వేస్తున్నారు. గన్నీ సంచి బరువు కింద కిలో తూకం వేస్తుండటంతో రైతుకు 40 కిలోల ధాన్యమే లెక్కలోకి వస్తుంది. రైతుకు నష్టం కలుగకుండా చర్యలు చేపడుతున్నారు. ధాన్యంలో తాలు అధికంగా ఉన్నచోట 100 నుంచి 500 గ్రాముల వరకు అదనంగా తూకం వేస్తున్నప్పటికీ, రైతులు తూర్పారబట్టి తీసుకొస్తే నష్టం వాటిల్లకుండా ఉండే అవకాశం ఉంది. రైస్‌మిల్లులోనూ ధాన్యం అన్‌లోడింగ్ సందర్భంగా నిర్వాహకులు ఎలాంటి కోతలు విధించడం లేదు.

మిల్లర్లతోనే అసలు సమస్య

ధాన్యాన్ని కల్లాలకు తరలించి, విక్రయించడం వరకు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేక పోయినా, కల్లాల నుంచి రైస్ మిల్లులకు తరలించడంలోనే అసలు సమస్య తలెత్తుతోంది. రైస్ మిల్లుల్లో అవసరం మేరకు కూలీలు లేక పోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. కల్లాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని లారీల్లో రైస్‌మిల్లులకు తరలించి నిలువ చేస్తారు. అలా మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేయడం లేదు. ఒక్కోసారి 24 గంటల పాటు లారీలు పదుల సంఖ్యలో మిల్లుల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితు లు నెలకొన్నాయి. దీంతో కల్లాల్లో కాంటా వేసిన ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోంది. కల్లా ల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయి, సరియైన సమ యంలో నిర్వాహకులు తూకం వేయలేకపోతు న్నారు. ఈ విషయమై అదనపు కలెక్టర్ మోతీలాల్ గురువారం మంచిర్యాల నియోజకవర్గంలోని పలు కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల్లో చేపట్టిన క్షేత్ర స్థాయి తనిఖీల్లో వెల్లడైంది. ధాన్యం తూకం వేయడం, మిల్లుల్లో అన్‌లోడింగ్ సమయంలోనూ అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని అదనపు కలెక్టర్ నిర్వాహకులను హెచ్చరించారు. అన్‌లోడింగ్ సమయంలో అవసరం మేరకు కూలీలను అందుబాటులో ఉంచాలని మిల్లర్లకు సూచించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
మోతీలాల్, అదనపు కలెక్టర్

కల్లాలకు తరలించి, తూకంలో జాప్యం కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే ప్రభుత్వపరంగా పూర్తి బాధ్యత వహిస్తాం. వర్షాలకు తడిసిన ధాన్యానికి గ్రేడును బట్టి పూర్తి స్థాయి ధరలు చెల్లించి కొనుగోలు చేస్తాం. ఈ విషయంలో రైతులు ఎలాంటి అభద్రతా భావానికి లోను కావలసిన అవసరం లేదు. తడిసిన ధాన్యాన్ని సేకరించి, వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తాం. ఏదైనా సమస్య తలెత్తితే సమాచారం ఇస్తే తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 25: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ సెకండ్ సెషన్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ విద్యార్థులు సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. దుర్గం చరణ్‌తేజ్ 85.04 పర్సెంటైల్‌తో జాతీయస్థాయిలో 11,733 ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడన్నారు. ఆడె నవనీత్ 16301 ర్యాంకు, తీగల అశ్రిత్ 83.64, దుర్గం అభిరనందన్ 75.50, రామటెంకి శివ 73.27, వెల్తూరి అఖిల్ 72.87, బత్తుల మధు 69.76, సాయిచరణ్ 65.62, అంజి 63.39 సాధించినట్లు తెలిపారు. వీరిని గురువారం కళాశాలలో అధ్యాపకులు అభినందించారు. సీవోఈ సూపరింటెండెంట్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు శ్రీరామవర్మ, రమేష్, లక్ష్మీనారాయణ, రవీందర్, శ్రీనివాస్, శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ టాపర్‌గా అక్షయ



మందమర్రిటౌన్, ఏప్రిల్ 25: మందమర్రిలోని కేజీబీవీ కళాశాలలో చదు వుతున్న బానోత్ అక్షయ ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో 1000 మార్కులకు 961 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించి కళాశాల పేరు నిలబెట్టిన అక్షయను లెక్చరర్లు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

జైపూర్, ఏప్రిల్ 25 : శెట్‌పల్లిలో ఆయిల్‌పామ్, పండ్ల తోటల సాగుపై ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు సాగు చేయాలన్నారు. ఉద్యానవన అధికారి తిరుపతి, మ్యాట్రిక్స్ అధికారి జగదీష్, జైన్ కంపెనీ డ్రిప్ అధికారి శంకర్, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25: ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆటోలకు గిరాకీలు లేక ఫైనాన్స్‌లు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించాలని గురువారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఆటో యూనియన్ నాయకులు వినతి పత్రాలు అందించారు. ఆటో యూనియన్ నాయకులు మేడి రాజు, దాసరి కుమార్, బండారి మల్లేష్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మీ పథకం ప్రవేశపెట్టడంతో ఆటోలకు గిరాకీలు లేకుండా పోయాయన్నారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు చెల్లించాలని, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు మృతి చెందితే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలని, ఫైనాన్స్‌ల వారి వేధింపులను అరికట్టాలన్నారు. గౌస్, కుమార్, శ్రీనివాస్, షరీఫ్, శ్రీను, గౌస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొబైల్ రిపేరు షాపుల వారిని ఆదుకోవాలి



మాట్లాడుతూ మొబైల్ యూనియన్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 25: పట్టణంలోని మొబైల్ రిపేరు షాపుల యజమానులు గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నామని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. గురువారం నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలో 200 మొబైల్ రిపేర్ షాపులు ఉన్నాయని, ప్రస్తుతం షాపులు నడవక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మంచిర్యాలలో 9 హోల్‌సేల్ మొబైల్ షాపులు నడుస్తున్నాయని, వాళ్లే డిస్ట్రిబ్యూటర్, హోల్‌సేల్, రిపేర్లు చేస్తున్నారని, దీంతో షాపులు నడవక కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతుందన్నారు. హోల్‌సేల్ షాపుల వారు రిపేర్లు చేయవద్దని కోరారు. వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, జనరల్ సెక్రెటరీ హాజీ, నాయకులు జాకీర్, స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏసీసీ, ఏప్రిల్ 25: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూలు పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పదో తరగతిలో 626 మందికిగాను 525 మంది హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 1165 మందికి 986 మంది హాజరయ్యారు. 179 మంది గైర్హాజరయ్యారు. మంచిర్యాల, బెల్లంపల్లిలో పదో తరగతికి 3 పరీక్ష కేంద్రాలు, ఇంటర్ 5 కేంద్రాలు ఏర్పాటు చేయగా పరీక్ష సజావుగా జరిగింది. డీఈవో యాదయ్య 3 పరీక్ష కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 8 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

ఉపాధిహామీ పనులపై సమావేశం

మందమర్రిరూరల్, ఏప్రిల్ 25: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై ఎంపీడీవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువ మంది కూలీలకు పనులను కల్పించాలని, వేసవి దృష్ట్యా పనులు జరిగే చోట జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏపీవో రజియా సుల్తానా, ఫీల్డ్ అసిస్టెంట్‌లు , టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 : కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 27 నుంచి 15 రోజులపాటు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించే శిబిరంలో పాల్గొనే క్రీడాకారులు పీఈటీ సదానందంకు రిపోర్టు చేయాలని, ఏవైనా సందేహాలుంటే 9849124856 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేలాల దొనలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

జైపూర్, ఏప్రిల్ 25: వేలాల గట్టు మల్లన్న దేవాలయంలోని దొనలో రెండు రోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దొనలోని శివలింగాన్ని వదిలిపెట్టి పక్కన తవ్వకాలు చేపట్టారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. యేటా శివరాత్రి మినహా గట్టు మల్లన్న దొన వైపు భక్తులు అరుదుగా వెలుతుంటారని, అదును చూసిన దుండగులు తవ్వకాలు చేపట్టినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై ఎస్సై శ్రీధర్‌ను వివరణ కోరగా ఆలయ కమిటీ సభ్యుల ద్వారా ఫిర్యాదు అందిందని, విచారణ జరిపి తవ్వకాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి



ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 25: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్‌లతో కలిసి రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యాలు లేకుండా తాగునీరు, విద్యుత్, నీడ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద రక్షణ దళాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నెంబర్లును ఏర్పాటు చేశామన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ప్రచారం, సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయన్నారు.

- లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వయోవృ ద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ఏర్పాటు చేసిన ఓటరు అవ గాహన సదస్సులో డీఆర్‌డీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకున్ని ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. దివ్యాంగులు, గర్భిణీలు, వయో వృద్ధులకు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, ప్రత్యేక వరు స ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం అం దరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కళాజాత బృం దం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మంచిర్యాల నుంచి కాలినడకన అయోధ్యకు



వినీత్‌కుమార్

ఏసీసీ, ఏప్రిల్ 25: మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్డుకు చెందిన పానం వినీత్‌కుమార్ అనే యువకుడు కాలినడకన అయోధ్య శ్రీరాముని దర్శనానికి బయ లు దేరాడు. ఈ నెల 22న సాయంత్రం మంచిర్యాల నుంచి బయలుదేరిన వినీత్‌కుమార్ గురువారం వాంకిడి వరకు వెళ్లాడు. రోజు ఉదయం 3 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు నడుస్తున్నానన్నారు. రోజుకు దాదాపు 40 కిలోమీటర్లు నడుస్తున్నానని తెలిపాడు. 45 నుంచి 50 రోజుల్లో అయోధ్యకు చేరుకుంటానని, బాలరామున్ని దర్శించుకోవాలని కాలినడకన వెళ్తున్నట్లు తెలిపాడు.

ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లమెంటరీ షెడ్యూలు విడుదల

ఏసీసీ, ఏప్రిల్ 25 : ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లమెంటరీ పరీక్షల షెడ్యూలును ఇంటర్ బోర్డు బుధవారం విడుదల చేసింది. మే 2వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు చివరి తేదీగా నిర్ణయించింది. మే 3న కళాశాలల ప్రిన్సిపాల్‌లు విద్యార్థుల నుంచి సేకరించిన పరీక్ష ఫీజులను బోర్డుకు చెల్లించాలని గడువు విధించింది. ఫీజు వివరాలకు సంబంధిత కళాశాలలో సంప్రదించాలని సూచించారు. మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల మేళాకు మంత్రికి ఆహ్వానం

ఏసీసీ, ఏప్రిల్ 25: జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో ఈ నెల 30, మే 1న నిర్వహించనున్న సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల మేళాకు రావాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఆహ్వానించారు. గురువారం హైద్రాబాద్ లోని మంత్రి నివాసంలో కలిసి మేళాకు రావాలని కోరారు. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తాం

రెండో రోజు రాజారం గ్రామస్థులతో చర్చలు విఫలం



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

కోటపల్లి, ఏప్రిల్ 25 : గ్రామ సమస్యలు పరిష్కరించే వరకు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేయమని రాజారం గ్రామస్థులు తీర్మానించగా రెండో రోజు గురువారం అధికారులు వారితో చర్చలు జరిపారు. ఎంపీడీవో ఆకుల భూమన్న, ఎస్‌ఐ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, ఆర్‌ఐ రాజలింగు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చలు జరిపిన అధికారులు కలెక్టర్‌కు సమస్యలు తెలిపామని, ఇప్పటికే రోడ్డు నిర్మాణం మంజూరైనందున అటవీ అనుమతుల కోసం సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకువస్తామని, అనంతరం రహదారి నిర్మిస్తామని కలెక్టర్ చెప్పారని గ్రామస్థులకు అధికారులు వివరించారు. అయితే ఇందుకు గ్రామస్థులు ససేమిరా అన్నారు. ముందుగా రోడ్డు నిర్మాణం పూర్తయితేనే తాము ఎన్నికల్లో ఓట్లు వేస్తామంటూ తేల్చి చెప్పారు. అయితే దీనిపై అధికారులు తమకు బాండ్ పేపరు రాసివ్వాలని గ్రామస్థులు కోరగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అలాంటి హామీలు ఇవ్వలేమని పేర్కొన్నారు. సుమారు గంటన్నరపాటు చర్చలు జరిపినా గ్రామస్థులు తమ సమస్యలు పరిష్కారం అయితేనే ముందుకు వెళ్తామని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

అట్టహాసంగా ప్రారంభమైన హ్యాండ్ బాల్ పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

నస్పూర్, ఏప్రిల్ 25: తెలంగాణ, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పట్టణంలోని సాధన స్కూల్‌లో బుధవారం రాత్రి రాష్ట్రసాయి హ్యాండ్ బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, సాధన గ్రూప్ స్కూల్స్ ఛైర్మన్ పెంచాల శ్రీధర్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫస్ట్ తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్-2024 పోటీలను ప్రారంభించారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. గురువారం ఉదయం నుంచి ఆయా జిల్లా జట్ల మధ్య పోటీలు జరిగాయి. పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభం సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇండియా టీం హ్యాండ్ బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్, జిల్లా కార్యదర్శి తుండ్ల శ్రీనివాస్, న్యాయవాది దామోదర్ లాల్‌బంగ్, అథ్లెటిక్స్ అసోసియే షన్ అధ్యక్ష కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య, భూపతి మధుకర్, పెంచాల వేణు, రామన్న, పాఠశాల ప్రిన్సిపాల్ పెంచాల సంధ్య, పీఈటీలు పున్నం శ్రీనివాస్, ప్రేమ్ సాయి పాల్గొన్నారు.

సింగరేణి మహిళ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



పూజ | సాయిజస్మిత | రూపాలి | పల్లవి | నేహా | శివనందిని

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25: పట్టణంలోని సింగరేణి మహిళ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పూజ 961, సాయిజస్మిత బైపీసీలో 949, రూపాలి సీఈసీలో 915 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో బైపీసీలో పల్లవి 417, నేహా 405, శివనందిని 404 మార్కులు సాధించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల నిర్వాహకులు హీరాలాల్ ఉపాధ్యాయ గురువారం సన్మానించారు. తల్లిదండ్రులను అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. హీరాలాల్ ఉపాధ్యాయ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా తమ కళాశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ ఫలితాల వెనక కళాశాల లెక్చరర్ల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

నస్పూర్, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు పీహెచ్‌సీ నుంచి జెండా ఊపి ఊరేగింపును ప్రారంభించారు. దోమలను నివారిస్తే మలేరియా నిర్మూలన సాధ్యమవుతుందని, ప్రజలు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేశారు. వైద్యులు సమత, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

కోటపల్లి: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సత్యనారాయణ సూచించారు. కోటపల్లి మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి సోకే విధానం, దోమలు, రకాలు, కీటక జనిత వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, సిబ్బంది శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పొన్నారంలో మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌ఎం గ్లోరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండ జాగ్రత్తలు తీసుకోవాలి

దండేపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వడదెబ్బ నివారణపై ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అవగాహన కల్పించారు. వడదెబ్బ సోకినప్పుడు స్థానిక ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. చెమట రూపంలో నీరు వెళ్లడం వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతారన్నారు. వడదెబ్బపై వైద్య సిబ్బంది ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి శివప్రతాప్, వైద్యాధికారి డాక్టర్ సతీష్, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

బరిలో 63 మంది అభ్యర్థులు



నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీనివాస్ గొమాసే

పెద్దపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసే నాటికి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రికార్డు స్థాయిలో 63 మంది అభ్యర్థులు 109 సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజైన గురువారం అధిక సంఖ్యలో నామినేషన్లు వేశారు. అంతకు ముందు వేసిన వారితోపాటు కొత్తగా మరికొంత మంది అభ్యర్థులు నామినేష న్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి శ్రీనివాస్ గొమాసేతో పాటు సీనియర్ నాయకుడు సోగాల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్, ధర్మ సమాజ్ పార్టీ, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫా మ్స్, బహుజన్ సమాజ్ పార్టీ, సోషలిస్టు పార్టీ ఇండియా, యువతరం పార్టీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్రీయ మానవ పార్టీ, బహుజన ముక్త్ పార్టీ, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీల నుంచి అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులు కూడా చాలా మంది నామినేషన్లు వేశారు.